ప్రజాశక్తి
గురువారం 11 జనవరి 2024
5
విజయనగరం



19 వరకు సామాజిక సమతా సంకల్ప ఉత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం

రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ 125 అడుగుల మహా విగ్రహాన్ని ఈనెల 19న విజయవాడలో ఆవిష్కరిస్తున్న సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఈనెల 9 నుంచి 19 వరకు జిల్లాలో సామాజిక సమతా సంకల్ప మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో ఈనెల 12న మధ్యాహ్నం 3 గంటల నుంచి అంబేద్కర్ జీవిత చరిత్రపై ఫోటో ఎగ్జిబిషన్, కవి సమ్మేళనం, వివిధ దళిత సంఘాలతో చర్చా గోష్ఠి, సాంస్కృతిక కార్యక్రమాలు, జీవిత చరిత్రపై లఘుచిత్రం ప్రదర్శన వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. 19న జిల్లా కేంద్రంలో మానవహారం, రక్తదాన శిబిరం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, జెడ్‌పి సిఇఒ రాజకుమార్, మెప్మా పీడీ సుధాకర్, గ్రామ వార్డు సచివాలయాల అధికారి నిర్మలాదేవి, డిఇఒ లింగేశ్వరరెడ్డి, సాంఘిక సంక్షేమ అధికారి రామానందం, డిపిఒ శ్రీధర్ రాజా, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కెఎవిఎల్‌ఎన్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి పాలనలో ధరాఘాతం

- ఐదేళ్లలో ఉత్తరాంధ్రకు ఏం ఒరగబెట్టారు?
- బూతులు తిట్టిన వారికే వైసిపిలో సీట్లు
- అధికారంలోకి వస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక, భూరక్షణ చట్టం రద్దు
- పార్లమెంట్ స్థానం పరిధిలో 7 సీట్లూ గెలవాలి
- విశాఖను గంజాయి రాజధానిగా మార్చారు
- రా..కదలిరా బహిరంగ సభలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు



బహిరంగ సభకు హాజరైన జనాలనుద్దేశించి మాట్లాడుతున్న టిడిపి అధినేత చంద్రబాబు



అభివాదం చేస్తున్న బేబినాయన

పలు సమస్యల పరిష్కారానికి బాబు హామీ

టిడిపి -జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజయనగరం కార్పోరేషన్ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. టిడిపి హయాంలో నిర్మించిన 4 వేల టిడ్కో ఇళ్లను లబ్దిదారులకు అప్పగిస్తామన్నారు. పార్వతీపురం జిల్లాలోని ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీని ఏవిధంగా పునరుద్ధరించాలో ఆలోచిస్తామని, బొబ్బిలిలో రైతు బజారు ఏర్పాటు చేస్తామని. బాడంగి మండలంలో వేగావతి నదిపై బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సముద్ర తీరంలో మత్స్యకారులకు జెట్టీలు ఏర్పాటు, రాజాం - పాలకొండ ప్రధాని రహదారి నిర్మాణం చేపడతామన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ప్రతి ఊరికీ రోడ్డు వేస్తామన్నారు. బొబ్బిలి నియోజకవర్గం ఇన్ ఛార్జీ బేబీ నాయన స్థానిక సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి చంద్రబాబు హామీ ఇచ్చారు.

ప్రజాశక్తి -బొబ్బిలి, విజయనగరం కోట

జగన్ రెడ్డి పాలనలో పెరిగిన నిత్యవసర ధరలతో పేదలు సంతోషంగా సంక్రాంతి పండగ జరుపుకునే పరిస్థితి కూడా లేదని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. బొబ్బిలిలో బుధవారం నిర్వహించిన రా..కదలిరా బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. 'నేడు జనసునామీతో బొబ్బిలి కోట బొబ్బిలి పులిలా గర్జిస్తోందని, ఈ గర్జనకు తాడేపల్లి ప్యాలెస్ పిల్లి వణికిపోతోందని అన్నారు. రోడ్లు కూడా సరిగా లేని సమయంలో ఆర్థిక సంస్కరణలు అందిపుచ్చుకుని రాష్ట్రాన్ని అభివృద్ధిచేశామని అన్నారు. ఒక్క ఛాన్స్‌తో జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని నాశనం చేశారు. వైసిపి పాలనలో అడుగడుగునా అన్యాయాలు, దౌర్జన్యాలే జరిగాయని, రాతియుగం వైపుగా నడిపిస్తున్నారని, రాతి యుగం కావాలో.. స్వర్ణయుగం వైపు నడుస్తారో ప్రజలే నిర్ణయించుకోవాలని అన్నారు.

భూరక్షణ చట్టం కాదు.. భక్షణ చట్టం

'మన పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ బొమ్మేంటి? ఆయనేమైనా మీతాత తరపు బంధువా? లేక మీ అమ్మమ్మ తరపు బంధువా? నిద్ర లేస్తుండగానే ఆయన బొమ్మ చూడడానికి ఆయనేమైనా వెంకటేశ్వరస్వామా? సర్వే రాళ్లపై బొమ్మలు ఏంటి? జగన్ తీసుకొచ్చింది భూ రక్షణ చట్టం కాదు..భక్షణ చట్టం. అది వస్తే మీ భూములు మీ పేర్ల మీద ఉండవు. రికార్డులు తారుమారు చేసి మీ భూముల్ని కొట్టేసే ప్రయత్నం చేస్తున్నారు.' అంటూ చంద్రబాబు ఘాటైన విమర్శ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో దీన్ని టిడిపి ఆమోదించబోదని. అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిల్ చట్టం రద్దు చేస్తామని ప్రకటించారు.

విజయనగరంలో గిరిజన యూనివర్సిటీ తెచ్చామని, కానీ దాన్ని నేటికి పూర్తి చేయలేదన్నారు. బోగాపురం ఎయిర్ పోర్ట్‌ను పూర్తి చేయలేదన్నారు. భావనపాడు పోర్టును నేను ప్రారంభిస్తే పేరు మార్చి మళ్లీ శంకుస్థాపన చేసి, భూములు అమ్ముకునే పరిస్థితికి వచ్చారని అన్నారు. ఓటమి భయంతో జగన్ రెడ్డి ఎమ్మెల్యేలను మార్చుతున్నారని. అందితే జుట్టు, అందకపోతే కాళ్లు పట్టుకునే రకం జగన్ రెడ్డి అని విమర్శించారు. కొంతమంది మంత్రులకు కూడా సీటివ్వలేదని చంద్రబాబు విమర్శించారు. రాజాం ఎమ్మెల్యేని పాయకరావుపేటకు మార్చినప్పటికీ అగ్రవర్ణాల వారిని మాత్రం మార్చకుండా జగన్ బతిమాలాడుకుంటున్నాడని అన్నారు. 80 చోట్ల ఎమ్మెల్యేలను ట్రాన్స్‌ఫర్ చేస్తుండటాన్ని బట్టి వచ్చే ఎన్నికల్లో వైసిపి ఓడిపోతుందని అర్థం చేసుకోవచ్చన్నారు. విజయనగరం పార్లమెంట్ పరిధిలోని ఏడుగురు వైసిపి ఎమ్మెల్యేలు అందినకాడికి దోచుకుంటున్నారని విమర్శించారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే వేధింపులు తట్టుకోలేక సాక్షి విలేకరి ఆత్మహత్య చేసుకున్నాడని, ఎమ్మెల్యేపై జగన్ రెడ్డి ఎందుకు కేసు పెట్టలేదని? ప్రశ్నించారు. సభలో పొలిట్ బ్యూరో సభ్యులు కమిడి కళావెంకటరావు, గుమ్మడి సంధ్యారాణి, మాజీ మంత్రి ఆర్‌కె ఎస్‌వి రంగారావు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలవలస యశస్విని, జిల్లా అధ్యక్షులు లోకం మాధవి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కర్తలు, పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రలో పెత్తందార్ల పెత్తనమేంటి?


ఉత్తరాంధ్ర టిడిపికి కంచుకోట వంటిదని చంద్రబాబు అన్నారు. వెనుకబడిన వర్గాలు అధికారం ఉండే ఉత్తరాంధ్రలో మళ్లీ బీసీల రాజ్యం వస్తుందన్నారు. ఉత్తరాంధ్రకి విజయసాయిరెడ్డిని, వైవి సుబ్బారెడ్డిని జగన్ సామంతరాజులుగా నియమించారని విమర్శించారు. బీసీలు అధికారం ఉన్న ప్రాంతంలో ఈ పెత్తందార్ల పెత్తనం ఎందుకన్నారు. ఉత్తరాంధ్రకు నీళ్లు, పరిశ్రమలు తెచ్చి మౌళిక సదుపాయాలు కల్పించి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. విశాఖ కేంద్రంగా ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామన్నారు. టిడిపి హయాంలో రూ.1,600 కోట్లు ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేశామన్నారు. నేడు జగన్ ఒక్క రూపాయైనా ఖర్చు చేశాడా? అని ప్రశ్నించారు. ఆంధ్రులకే మద్దువలస, తారకరామ, తోటపల్లి, వంశధార వంటి ప్రాజెక్టులన్నీ అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. విశాఖను ఆర్థిక రాజధానిగా, ఐటీ రాజధానిగా, టూరిజం క్యాపిటల్ గా తయారు చేయాలని నేను సంకల్పిస్తే జగన్ రెడ్డి దాన్ని గంజాయి, క్రైమ్ క్యాపిటల్ మార్చారని విమర్శించారు.

ఉపాధ్యాయుల వినతి

ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై హామీ ఇవ్వాలని చంద్రబాబును ఎపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.జోగినాయుడు, జిల్లా నాయకులు జెసి రాజు కోరారు. పలు సమస్యలను చంద్రబాబుకు వివరించి అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామని హామీ ఇవ్వాలని కోరారు.

వైసిపికి గుడ్‌బై చెప్పిన సర్పంచ్, ఎంపిటిసిలు

చంద్రబాబు పర్యటనతో అధికార వైసిపికి భారీ షాక్ తగిలింది. బాడంగి మండలం కోడూరు ఎంపిటిసి మరిపి శ్రీదేవి, ఆమె భర్త రమేష్ వైసిపిని వీడి కొప్పలవెలమ పార్లమెంటరీ కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు ఆధ్వర్యాన టిడిపిలో చేరారు. రామభద్రపురం మండలం కోట శిర్లాం సర్పంచ్ తాడ్డి తిరుపతమ్మ, ఆమె భర్త శ్రీను, మరో 500 కుటుంబాలు, మాజీకౌన్సిలర్లు రెడ్డి ప్రసాద్, ఎ.అప్పారావు టిడిపిలో చేరారు. గొల్లపల్లి 12వ వార్డుకు చెందిన పిరిడి ఈశ్వరరావు, పిరిడి పద్మావతి, మరో 200 కుటుంబాలవారు, వేదంత దవలపర్ల అధినేత కోట సురేష్ చేరారు. వీరందరికీ చంద్రబాబు కండువాలు వేసి ఆహ్వానించారు. బొబ్బిలి నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగురవేస్తామని నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన అన్నారు.



కత్తి, డాలుతో చంద్రబాబునాయుడు



చంద్రబాబుకు సమస్యలను వివరిస్తున్న అంగన్వాడీలు

చంద్రబాబుకు అంగన్వాడీల వినతి

రాష్ట్రంలో అంగన్వాడీలు చేపట్టిన పోరాటానికి అండగా ఉండాలని చంద్రబాబునాయుడును అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కామేశ్వరి, రోజా, నిర్మల కోరారు. సభలో చంద్రబాబును కలిసి మద్దతు కోరారు. అంగన్వాడీలకు తెలంగాణ కంటే అదనంగా వేతనాలు ఇస్తామని జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయడం లేదన్నారు. నాలుగు వారాలుగా సమ్మె చేస్తే పట్టించుకోవడం లేదన్నారు. అధికారంలోకి వస్తే అంగన్వాడీలను రెగ్యులర్ చేసి కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. చంద్రబాబు సానుకూలంగా స్పందించారు.

మున్సిపల్ కార్మికుల బిక్షాటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) అనుబంధ సంఘం ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు సమ్మె బుధవారం నాటికి 16వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి గంటస్తంభం వరకు భిక్షాటన చేసి ప్రభుత్వ వైఖరిపై తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి 'పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగి ఆ నీళ్లను నెత్తిన జల్లుకున్నా పుణ్యమే, లక్ష రూపాయలు జీతం ఇచ్చినా మీ రుణం తీర్చుకోలేం. అందర్నీ పర్మినెంట్ చేస్తాం' అనివాగ్దానం చేశారని వివరించారు. సమాన పనికి సమానం ఇస్తామని చెప్పారని, కానీ ఐదేళ్లువుతున్నా హామీలు అమలు చేయలేదన్నారు. 16 రోజులుగా సమ్మె చేస్తున్నా స్పందించడ లేదన్నారు. సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రజిని, పైడిరాజు, వెంకట్రావు, వంశీ, సూరి, ఈశ్వరమ్మ, రమణ బాబురావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం : బిక్షాటన చేస్తున్న కార్మికులు



నెల్లిమర్ల : వాహనాలను అడ్డుకొని నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

సమస్యలు పరిష్కరించకుండా పనులెలా చేయిస్తారు?

నెల్లిమర్ల : హామీలు అమలు చేయకుండా ప్రయివేటు వ్యక్తులతో పనులెలా చేయిస్తారని, ఇటువంటి కవ్వింపు చర్యలను అడ్డుకుంటామని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు టి.వి.రమణ, జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ యునియాన్ పట్టణ అధ్యక్షులు బొగ్గ భాస్కరరావు హెచ్చరించారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద అధికార్లు, పాలక వర్గం సభ్యులు ప్రైవేట్ వ్యక్తులతో పారిశుధ్య పనులు చేయడానికి ప్రయత్నించారు. దీన్ని మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు అడ్డుకున్నారు. సమస్యలు పరిష్కరించకపోగా ఇతర వ్యక్తులతో పనులు జరిపించే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు.

రాజాం: మున్సిపల్ కార్మికులు మాధవ బజార్లో భిక్షాటన చేసి ప్రభుత్వ వైఖరి పై నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, అనిల్ కుమార్, గురువులు, రాజేష్, గిరిబాబు, లక్ష్మి, భాస్కరరావు, వెంకటీ, శంకర్రావు, అచ్యుత్ రావు, రవి, గోపి, సింహాచలం పాల్గొన్నారు.

బొబ్బిలి : పారిశుధ్య కార్మికులు సమ్మె శిబిరంలో నిరసన తెలిపారు.

సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం : కోలగట్ల

ప్రజాశక్తిగీవిజయనగరం టౌన్

పేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పునరుద్ఘాటించారు. బుధవారం సారికలో ఇళ్ల స్థలాలు కేటాయించిన 527 మంది లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 15 వేల పట్టాలను అందజేశానని, ప్రస్తుతం 30 వేల పట్టాలను అందించామని చెప్పారు. ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం లక్షా ఎనభై వేల రూపాయలు సహాయం అందజేస్తుందని వెల్లడించారు. ప్రభుత్వ పథకాలను పూర్తి పారదర్శకంగా అవినీతి రహితంగా అందిస్తున్నట్లు చెప్పారు. నగర మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ. నగరంలో అన్ని సౌకర్యాలూ మెరుగుపడ్డాయని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఫ్లోర్ లీడర్ ఎస్ వివి రాజేష్, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, హౌసింగ్ కమిటీ సభ్యులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి కుళాయిలు ప్రారంభం

రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న వసంత్ విహార్‌లో తాగునీటి కుళాయిలను డిప్యూటీ స్పీకర్‌కోలగట్ల వీరభద్రస్వామి బుధవారం ప్రారంభించారు. వసంత్ విహార్ అసోసియేషన్ పెద్దలు వినతి మేరకు కోలగట్ల స్పందించి నీటి సమస్యను పరిష్కరించారు.



లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నగరంలో వివిధ డివిజన్లలో కోటీ 52 లక్షల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు మేయర్ విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. నాలుగో డివిజన్ బాబా మెట్ట ప్రాంతంలో రహదారులు నిర్మాణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టులు భర్తీ చేయాలంటే అరెస్టులా? : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మెగా డిఎస్సీ విడుదల చేయాలని విజయవాడ లోని సీఎం క్యాంప్ ఆఫీస్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేసేందుకు వెళుతున్న నాయకులను పోలీసులు అక్రమ అరెస్టులు చేయడాన్ని డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.తాతి నాయుడు ఖండించారు. విలేకర్లతో ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేయలేదని, ఐదేళ్లవుతున్నా డిఎస్‌సి నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేయకపోవడం దారుణమని అన్నారు. వేలాది రూపాయలు డబ్బులు ఖర్చు పెట్టుకొని కోచింగ్‌లు తీసుకుంటున్నారని, ఉద్యోగాలు రాక బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆవేదన చెందారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని కోరితే ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందన్నారు. తక్షణమే డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు హరీష్, సతీష్, గణేష్ లు పాల్గొన్నారు.

22వ రోజుకు సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 22వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు నిరసన కొనసాగించారు. కొనసాగిం చారు. తమను రెగ్యులర్ చేయాలని, హెచ్‌ఎర్ పాలసీ అమలు చేయాలని,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జెఎసి నేతలు మాట్లాడుతూ విద్యాశాఖలో కీలకపాత్రపోషిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని సిఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం ఆపేది లేదని అన్నారు. జెఎసి నాయకులు గురువులు, శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

17లోగా ఓటరు సవరణ దరఖాస్తులు పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

ఓటర్ల సవరణ కోసం అందిన దరఖాస్తులను ఈనెల 17వ తేదీ లోగా డిస్పోజ్ చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఓటర్లు ఆన్లైన్ ద్వారా ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులన్నిటికీ వెంటనే సమాధానాలు పంపాలని డి.ఆర్.ఓ కు సూచించారు. ఎన్నికలు జరిగే వరకూ స్వీప్ కార్యక్రమాలు జరుపుతామని, కార్యక్రమంలో రాజకీయ ప్రతినిధులు పాల్గొని ఓటరు చైతన్యం కోసం సలహాలు అందించాలన్నారు. బిఎల్‌ఒల నుంచి ఇఆర్‌ఒల వరకూ వారి పాస్ వర్డ్ లను ఎవ్వరికీ షేర్ చేయకూడదని, వారే స్వయంగా ఆపరేట్ చేయాలని, లేదంటే శిక్షలకు గురవుతారని స్పష్టం చేశారు. ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకు వారం లో ఫారం 6, 7,8,ల కోసం మొత్తం 4321 దరఖాస్తులు అందాయని తెలిపారు. వీటిని ఈనెల 17లోగా డిస్పోజ్ చేయాలని ఇఆర్‌ఒలకు తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ అనిత, ఇఆర్‌ఒలు వెంకటేశ్వర రావు, సుధారాణి, దొర, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు నవోదయ మోడల్ టెస్ట్

ప్రజాశక్తి- గజపతినగరం

ఈ నెల 11న నిర్వహించనున్న నవోదయ మోడల్ టాలెంట్ టెస్ట్‌ను విద్యార్థులు ఉపయోగించుకోవాలని హర్షవర్ధన స్కూల్ కరస్పాండెంట్ వివి ప్రదీప్ కుమార్ తెలిపారు. గురువారం ఈ పరీక్ష తమ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తామన్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో వేరువేరుగా ఈ టెస్ట్‌ను నిర్వహిస్తామని, విజేతకులకు ప్రత్యేక బహుమతులు ఇస్తామని చెప్పారు. విద్యార్థి పేరు రిజిస్ట్రేషన్ కోసం 7386149606, 9985464600 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర క్రీడలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకే ఆడుదాం ఆంధ్ర క్రీడలు దోహదపడతాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. బుధవారం స్థానిక రాజీవ్ స్టేడియంలో మండల స్థాయిలో ఆడదాం ఆంధ్ర పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బెలూన్లను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ సచివాలయ స్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించి ప్రోత్సాహక బహుమతులను కూడా అందజేస్తున్నట్లు చెప్పారు. నగరంలో కబడ్డీ , ఖో ఖో క్రీడలలో నిష్ణాతులైన క్రీడాకారులు ఉన్నారని,రాష్ట్రస్థాయిలో గెలుపొంది నగర ఖ్యాతిని ఇనుమడింపజేయాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ ఆర్ శ్రీ రాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాద్‌రావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కాళ్ళ సూరిబాబు, డిఎస్‌డిఒ తదితరులు పాల్గొన్నారు.

మైత్రీ మీడియా ఆధ్వర్యంలో 12న ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సంక్రాంతి సంబరాల్లో భాగంగా మైత్రీమీడియా, ఎస్ ఆర్ షాపింగ్ మాల్ సంయుక్తంగా ఈనెల 12న గురజాడ కళాభారతిలో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు మైత్రీ మీడియా డైరెక్టర్ అవనాపు విక్రమ్ తెలిపారు. మన సంస్కృతి , సంప్రదాయాలను భావితరాలకు చాటి చెప్పేందుకు, మగువల్లో కళానైపుణ్యతను వెలికి తీసేందుకు మైత్రీమీడియా ఆవిర్భావం నుండి సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తుందని, అందులో భాగంగా ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీల్లో మొదటి బహుమతిగా బంగారు నక్లెస్, రెండో బహుమతిగా బంగారు చెవిదిద్దులు, మూడో బహుమతిగా 43 ఇంచెస్ స్మార్ట్ టివితో పాటు పది కన్సోలేషన్ బహుమతులు అందిస్తామన్నారు. పోటీలో పాల్గొనే ప్రతీ ఒక్కరికీ బహుమతి ఇస్తామని తెలిపారు. మగువలంతా మైత్రీమీడియా జనవరి 12వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి గురజాడ కళాభారతిలో నిర్వహించే పోటీల్లో పాల్గొని బహుమతులు సొంతం చేసుకోవాలని ఆయన కోరారు.

ట్రెజర్ హాంట్ విజేతకు 12వ తేదీన బహుమతి ప్రదానం

కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మైత్రీ మీడియా డిసెంబర్ 31న నిర్వహించిన ట్రెజర్ హాంట్ కాంపిటేషన్ లో అర్హత పొందిన వారికి విజయనగరం మైత్రీమీడియా కార్యాలయంలో లక్కీడ్రా నిర్వహించారు. విజేతలకు 12న గురజాడ కళాభారతిలో బహుమతులు అందిస్తామని వెల్లడించారు.

బలవంతంగా పార్టీలోకి తీసుకోలేదు

మెంటాడ: మండలంలోని ఆండ్ర ఎంపిటిసి పి అప్పలనరసమ్మను బలవంతంగా వైసిపి పార్టీలోకి తీసుకున్నట్టు ఆమె ప్రచారం చేస్తున్నారని వైసిపికి అంత అవసరం లేదని ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, మండల కన్వీనర్ రాయిపిల్లి రామారావులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అవలంభిస్తున్న సంక్షేమ, అభివృద్ధిను చూసి పార్టీలోకి చేరుతున్నట్టు ఎంపిటిసి అప్పలనరసమ్మ, ఆమె తండ్రి కృష్ణ ఫోన్ చెప్పడంతో కండువా వేసి ఆహ్వానించామన్నారు. ఆమె చేరిక వల్ల పార్టీకి వచ్చిన లాభం ఏమీ లేదన్నారు. ఉదయం కండువా వేసుకున్న ఎంపిటిసి అప్పలనరసమ్మతో సాయింత్రం టిడిపి నాయకులు ప్రెస్ మీట్ టిడిపి పార్టీ నుంచి వీడే ప్రసక్తే లేదని చెప్పించడం వెనుక ఆమెను ఏ మేరకు భయభ్రాంతులకు గురిచేశారో అర్థం చేసుకోవచ్చు అన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి ఈశ్వరరావు, పిట్టాడ సర్పంచ్ కాపారపు పైడిపునాయుడు, ఆండ్ర మాజీ సర్పంచ్ కుంచి తిరుపతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

బొండపల్లి : పింఛన్ పొందుతున్న లబ్ధిదారులందరూ సిఎం జగనన్నను గుర్తుంచుకొని ఆశీర్వదించాలని గొట్లాం పిఎసిఎస్ అధ్యక్షులు మహంతి రమణ అన్నారు. బుధవారం మండలంలోని ఒంపల్లి గ్రామ సచివాలయంలో సర్పంచ్ లండ నారాయణమ్మ అధ్యక్షతన నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. వేంద్రంలో సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు లబ్ధిదారులకు పింఛన్లను అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మీసాల తులసీరావు, గ్రామ కార్యదర్శి రమాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యపై అవగాహన

గంట్యాడ: మండలంలోని మదనాపురం ఆదర్శ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు బుధవారం ఒకేషనల్ విద్యపై అవగాహన కల్పించారు. ఎస్ఎస్ఎ ఆధ్వర్యంలో ఐటిఆర్సి కంపెనీ సమక్షంలో విజ్ఞాన పర్యటన నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులను తాటిపూడి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారితో జరిగిన సంభాషణలతో ఐటిఐటిఈఎస్ ఏ విధంగా ఉపయోగపడుతుందో విద్యార్థులకు బ్యాంకు మేనేజర్ నగేష్, భవాని శంకర్ వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ రామకృష్ణ, సైన్స్ టీచర్ శంకర్, ఒకేషనల్ ట్రైనర్ బి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కమాండెంట్‌ను కలిసిన ఎమ్మెల్యే

డెంకాడ: చింతలవలస 5వ ఎపియస్‌పి బెటాలియన్ కమాండెంట్ రాహుల్ దేవ్ శర్మను నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బుధవారం బెటాలియన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు ఉన్నారు.

ప్రజలు తలచుకుంటే మార్పు సాధ్యం

శృంగవరపుకోట: ప్రజలు తలచుకుంటే రాజకీయ వ్యవస్థలో మార్పు సాధ్యమేనని, ఢిల్లీ, పంజాబ్ తరహాలో అవినీతి లేని అభివృద్ధి కోసం ఆమ్‌ఆద్మీ పార్టీలో చేరేందుకు ప్రజలంతా ముందుకు రావాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.దయానంద్ కోరారు. బుధవారం ఎస్.కోటకు చెందిన విశ్రాంత ఉద్యోగి కృష్ణారావుతో పాటు కొంతమంది నియోజకవర్గం ఇంచార్జి పూసపాటి ప్రతాప్ వర్మ ఆధ్వర్యంలో ఆప్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బూరాడ శ్రీనివాస్, విజయనగరం నియోజకవర్గం కన్వీనర్ తిప్పాన కోటేశ్వరరావు, జగన్, శ్యాం, రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం

రేగిడి: బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎపిజివిబి రీజనల్ మేనేజర్ బి రాఘవేంద్ర అన్నారు. బుధవారం బ్యాంకు మేనేజర్ పొన్నాన ఈశ్వరరావు ఆధ్వర్యంలో నూతన ఎపిజివిబి భవనాన్ని ఉంగరాడ రోడ్డులో ప్రారంభించారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులకు తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం రీజియన్ బిజినెస్ మేనేజర్ సోమేశ్వరరావు, ఉంగరాడ సర్పంచ్ శోభారాణి, అకౌంటెంట్ ఈశ్వరరావు, కింజరాపు మధుసూదన్ రావు నాయుడు, ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

పూసపాటిరేగ : మండలంలోని చోడమ్మ అగ్రహారం పరిదిలోగల జి. చోడవరంలో సిపి ఆక్వా పరిశ్రమ వాగులు, రస్తాలు కలిపి సుమారుగా 6 ఎకరాలు భూమి ఆక్రమణలో ఉందని చోడమ్మ అగ్రహారం మాజీ సర్పంచి నల్ల అప్పలరాజు బుధవారం తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఆ భూమిని సర్వే చేయించి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

శాంతియుత ధర్నాకు అనుమతి ఇవ్వండి

శాంతియుతంగా సిపి పరిశ్రమ దగ్గర ధర్నా చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని కార్మిక నాయకుడు నల్ల అప్పలరాజు తహశీల్దార్ బాస్కరరావుకు వినతి అందించారు. సిపి ఆక్వా పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికులగా పనిచేస్తున్న వారిని అకారణంగా తొలగించిన విషయం తెలిసిందే అన్నారు. ఈ విషయమై పరిశ్రమ ముందు పోరాటం చేసిన విషయం కూడా తమకు తెలుసునని అయితే కార్మికులకు జరిగే అన్యాయంపై న్యాయం చేయాలని కోరేందుకు ధర్నా చేపడతామన్నారు. న్యాయం జరిగేంత వరకూ పరిశ్రమ దరిలో ధర్నాకు అనుమతి కోరారు. ఆయనతో పాటు కార్మికులు ఉన్నారు.

నరసింహ కొండకు పాదయాత్ర

కొత్తవలస: ధనుర్మాసం పురస్కరించుకుని మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 3వేల మంది భక్తులతో సింహాచలం వరాహ లక్ష్మి నరసింహ స్వామీ కొండకు బుధవారం పాదయాత్రగా తరలి వెళ్లారు. ట్రస్టు ప్రాంగణంలో చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్ తల్లి సుబ్బలక్ష్మమ్మ పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు. ఒరిస్సా, అరకు, దుమ్రీగూడ, ఎస్.కోట, బొడ్డవర, చిలకలగెడ్డ, బొర్రా తదితర ప్రాంతాలనుంచి హాజరైన గిరిజనులు గ్రామంలోని రామాలయంలో భజన, ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పాదయాత్రగా భక్తులు సింహాచలం కొండకు చేరుకొని స్వామిని దర్శించారు. భక్తులకు చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్ ప్రసాదం, జ్ఞాపికలను అందజేశారు. పాదయాత్రలో పాల్గొన్న భక్తులకు వసతి, బోజన సౌకర్యాలను ట్రస్టు నిర్వాహకులు కల్పించారు.

30వ రోజుకు అంగన్వాడీల సమ్మె

- కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న దీక్షలు
- జిల్లా అంతటా వినూత్న నిరసనలు



జామి: మోకాళ్లపై నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-గజపతినగరం

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 30వ రోజుకు చేరుకుంది. అయినా మొక్కవోని దీక్షతో అంగన్వాడీలు జిల్లా అంతటా సమ్మె కొనసాగిస్తూ వినూత్న రూపాల్లో ప్రభుత్వానికి తమ నిరసన తెలుపుతున్నారు. గజపతినగరంలో గర్భిణులు, బాలింతలు చిన్నారులతో సమ్మె శిబిరంలో పాల్గొన్నారు. జగనన్నా నీకు శతకోటి వందనాలు అంటూ నిరసన తెలిపారు. సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మద్దతు తెలిపారు. అంగన్వాడీల ఉద్యమానికి పార్టీ అండదండలు ఉంటాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు, స్కీం వర్కర్లు, ఉద్యోగులు, కూలీలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. ధరలు విపరీతంగా పెంచడంతో కుటుంబాలు బతకలేని పరిస్థితిని తీసుకొస్తోందన్నారు. సమస్యలు పరిష్కరించాలని పోరాటాలు చేస్తే అణచివేసే చర్యలు తీసుకోవడం దుర్మార్గమన్నారు. మహిళా సాధికారత కోసం పాటుపడతామన్న మాటలు పక్కనపెట్టి అంగనవాడీలకు జగన్ ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. ఎస్మా ప్రయోగంతో బెదిరిస్తే బెదిరిపోయే చరిత్ర అంగన్వాడీలకు లేదని, న్యాయమైన పరిష్కరించకపోతే చరిత్రలో మాట తప్పిన ముఖ్యమంత్రిగా నిలుస్తారని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పండగ ముందే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజా మద్దతుతో పోరాటం మరింత ఉధృతమవుతుందని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, నాయకులు సన్యాసమ్మ, రాములమ్మ, జ్యోతి, రమణమ్మ, పద్మ, సుజాత పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

కలెక్టరేట్ వద్ద చేపట్టిన సమ్మె శిబిరంలో అంగన్వాడీల నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు మాట్లాడుతూ మహిళలు నడిరోడ్డుపై నెల రోజులుగా సమ్మె చేస్తున్నా స్పందించకపోవడం ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనమని బాధాకరమన్నారు. ప్రభుత్వం మానవత్వంతో ఆలోచించాలన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సి ఐ టి యు నగర కార్యదర్శి బి రమణ, సుధారాణి, సుశీల, ఉష, రాధ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

రామభద్రపురం : ప్రభుత్వం దిగొచ్చేవరకు సమ్మె కొనసాగిస్తామని, అందుకు తమ మద్దతు ఉంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. ఐసిడిఎస్ కాంప్లెక్స్ వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీనివాసరావు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

బాడంగి : అంగన్వాడీల సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సురేష్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

జామి : తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో అంగన్వాడీలు 'ముఖ్యమంత్రి గారూ మీకు దండం పెడతాం ..మా సమస్యలు పరిష్కరించండి' అంటూ దండాలు పెడుతూ నిరసన తెలిపారు. సమ్మెకు ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమ్మె చేపట్టి 30రోజులు కావస్తున్నా ప్రభుత్వం సమస్యలు పరిష్కారం చేయకుండా మీనా మేషాలు లెక్కించడం అన్యాయమన్నారు. యూనియన్ నాయకులు కనకమహాలక్ష్మి, రామలక్ష్మి, శ్రీదేవి, వరలక్ష్మీశ్వరి పాల్గొన్నారు.

శృంగవరపుకోట : అంగన్వాడీ వర్కర్లు ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు మద్దిల రమణ, ప్రాజెక్టు నాయకులు డి.జయలక్ష్మి, జి.క్రాంతి, వి.మాణిక్యం, డి.సుశీల తదితరులు పాల్గొన్నారు.

రాజాం : 30వ రోజు సమ్మె కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ధవలేశ్వరి సత్యవతి సుశీలశ్రీదేవి నిర్మల ప్రమీల లక్ష్మి దమయంతి లలిత జ్యోతి మొదలగువారు పాల్గొన్నారు.



గజపతినగరం: చేతులు జోడించి నమస్కరిస్తున్న అంగన్వాడీలు



రామభద్రపురం: మాట్లాడుతున్న తమ్మినేని సూర్యనారాయణ

524 సిమెంట్ బస్తాలు గోల్‌మాల్

- మస్తర్ షీట్‌లో సంతకాలు, నిశానీలు లేకుండా పేమెంట్లు
- సామాజిక తనిఖీ ప్రజా వేదికలో వెలుగు చూసిన అక్రమాలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని తునివాడ గ్రామంలో పంచాయతీ రాజ్ శాఖ నుంచి హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాల నూతన నిర్మాణాలకు సిమెంటు పంపిణీ చేసినప్పటికీ అక్కడ నిర్మాణం జరగకపోయినా 1.52 లక్షల రూపాయల విలువ గల 524 బస్తాలు మాయం కావడంతో సామాజిక తనిఖీ ప్రజావేదికలో సిమెంట్ వ్యవహారం అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో 1,778 పనులకు సంబంధించి 19.83 కోట్ల రూపాయలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ ప్రజా వేదికకు ప్రొసీడింగ్ డుమా అధికారి లక్ష్మణరావు, ఎపిడి ఎం శ్రీనివాసరావు, జిల్లా విజిలెన్స్ అధికారి పి. వెంకటరమణ హాజరై పరిశీలించారు. పంచాయతీరాజ్ 27 పనులు, ఆర్డబ్ల్యూఎస్ 11 పనులు, ఎస్-ఎస్ఎ 3 పనులు, ఈజీఎస్ 1737 పనులకు రూ.19.83 కోట్లు ఖర్చు చేయడంపై ప్రజా వేదిక నిర్వహించారు. తునివాడ గ్రామానికి సంబంధించి హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం నిర్మాణాలు చేపట్టకుండా సిమెంట్ పక్కదారి పట్టినట్టు తెలుగులోకి వచ్చింది. ఖండ్యాం పంచాయతీలో కన్య పంచాయితీలో 74 సిమెంట్ బస్తాల లెక్క తేలడం లేదని వెలుగులోకి వచ్చింది. పంచాయతీ రాజ్ జెఇ రామకృష్ణ మాట్లాడుతూ సిమెంటు ఒక పంచాయతీ నుంచి వేరొక పంచాయతీకి సర్దుబాటు అయిందని తెలిపారు. మస్టర్లలో సంతకాలు, నిశానీలు లేకుండా పేమెంట్ ఇచ్చినట్లు వెలుగు చూశాయి. లక్ష్యంపురం లో మీసాల వరలక్ష్మికి హాజరులో 6 రోజులు దిద్దుబాట్లు చేయడంతో అదనంగా 1,320 రూపాయలు చెల్లించినట్లు వెలుగులోకి వచ్చింది. చెరువు కొలతల్లో తేడాలు కారణంగా రెండు వారాలు నగదు జమమైనట్లు వెల్లడైంది. తునివాడ, కందిస, చాటాయివలస గ్రామాల్లో వేతన దారుల మస్టర్ సీట్లో సంతకాలు, నిసానీలు లేకుండా బిల్లులు చెల్లించడం పై అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. కందివలసలో రోడ్డుకు ఇరు వైపులా మొక్కలు లేకపోయినా బిల్లు డ్రా అయినట్లు తెలిపారు. సోమరాజుపేటలో రూ.25,400లకు సంబంధించి పని వర్కు బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఆ నగదు పరిస్థితి ఏంటని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇన్ని జరిగినా ప్రభుత్వ నిధులు ఎంతమేర అవకతవకలు జరిగాయో అధికారులు వెల్లడించెకపోవడం కొసమెరుపు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి వావిలాపల్లి జగన్ మోహన్ రావు, ఎంపిడిఒ శ్యామల కుమారి, ఎపిఒ సంకాబత్తుల హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.



సిమెంట్‌పై మండల జెఇని వివరణ అడుగుతున్న డుమా అధికారి

పేదలకు దుస్తులు పంపిణీ

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురం సర్పంచ్ బాల రామలక్ష్మి, ఉప సర్పంచ్ బాల అప్పలరాజు బుధవారం గ్రామస్థులుకు సంక్రాంతి సందర్భంగా దుస్తులను పంపీణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న బడుగు, బలహీన వర్గాలు, పేదలకు భోజనం పెట్టి, బట్టలతో పాటు ఒక్కొకరికి రూ. 100లు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా సంక్రాంతి సందర్భంగా బట్టలు పంచడం ఆనవాయితీగా వస్తుందన్నారు. సంక్రాంతిని పేదలంతా ఆనందంగా చేసుకోవాలన్న ఉద్దేశంతో తమ వంతు సహాకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దంగుడుబియ్యపు ఈశ్వర్రావు, జలపారి అప్పారావు, వాసు, తదితర నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

12న సర్వసభ్య సమావేశం


వేపాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 12న సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నామని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఉమా తెలిపారు. ఎంపిపి సత్యవంతుడు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొనాలని కోరారు.

అదే సారు.. మారని తీరు

- ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌కు మరోసారి హాజరుకాని బూరాడ వైద్యాధికారి
- ఆస్పత్రిలోనూ కనిపించని వైద్యుడు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని తోకలవలసలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌కు బూరాడ పిహెచ్‌సి వైద్యాధికారి చలమయ్య హాజరు కాకపోవడంతో గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గతంలో జరిగిన కార్యక్రమానికి కూడా ఆయన హాజరు కాలేదని వాపోతున్నారు. దీంతో చేసేదేమీ లేక దిగువ స్థాయి సిబ్బంది ఎంఎల్‌హెచ్ పి ధనలక్ష్మి, ఏఎన్ఎం సుబ్బలక్ష్మిలతో వైద్య సేవలు పొంది కార్యక్రమాన్ని ముగించారు. ఈ గ్రామంలో 1,307 మంది జనాభా ఉన్నారు. వీరు బూరాడ ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే 8 కిలోమీటర్లు మేర ప్రయాణించాలి. నెలలో ప్రతి 2వ బుధవారం ఈ గ్రామానికి 104 ఆరోగ్య సేవలు అందవలసి ఉంది. ఈ కార్యక్రమంలో భాగంగా బూరాడ పిహెచ్‌సి వైద్యులు వైద్య సేవలు అందించాల్సి ఉన్నప్పటికీ ఆయన జాడ కనిపించడం లేదు. డాక్టరు గైర్హాజరుతో పూరి స్థాయి వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వైద్యుడు లేకుండా సిబ్బంది తనిఖీలు చేస్తే ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని చాలా మంది గ్రామస్తులు వైద్యం శిబిరానికి రావడం లేదు. గ్రామస్తులు ఫిర్యాదు మేరకు ప్రజాశక్తి ఉదయం నుంచి మధ్యాహ్నం నాలుగు వరకు గ్రామంలో ఉండి వైద్య సేవలపై ఆరా తీసి పరిశీలించినా పూర్తిగా వైద్యులు రాకపోవడంతో జ్వరాలు, అతిసార సోకిన రోగులు రాజాం ప్రైవేటు ఆసుపత్రికి వెళ్ళి చేతి చమురు వదిలించుకోవలసిన పరిస్థితి నెలకొంది. దీంతో బూరాడ వైద్యాధికారి చలమయ్య పనితీరుపై గ్రామస్తులు మండి పడుతున్నారు. కాగా ఆయన బుధవారం ఆస్పత్రిలో కూడా కనిపించలేదని సిబ్బంది చెబుతున్నారు. క్షేత్ర స్థాయిలో లేక, ఆస్పత్రిలో లేక ఎక్కడికి వెళ్లారనే దానిపై స్పష్టత లేదు. పైగా ఆయన ఆస్పత్రికి వచ్చినట్లు సంతకం ఉందని సమాచారం. ఇప్పటికైనా వైద్యులు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించకుంటే, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పలువురు రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బూరాడ పిహెచ్‌సిలో ఖాళీగా ఉన్న వైద్యుని కుర్చీ

గ్రామీణ కళలకు ప్రోత్సాహం.. గొప్ప విషయం

ప్రజాశక్తి- బాడంగి

ఉత్తరాంధ్ర సాంస్కృతిక పోటీలను పోత్సహించి కనుమరుగవుతున్న గ్రామీణ ప్రాంత కళలను గుర్తించి పోటీలు నిర్వహించడం గొప్ప విషయమని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, అన్నారు. కీర్తిశేషులు తెంటు భారతీ జ్ఞాపకార్ధంగా బుధవారం మండలంలోని కోడూరు గ్రామంలో స్వర్ణ భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెంటు సత్యం మాస్టర్ నిర్వహించిన కోలాటం సాంస్కృతిక పోటీలను వారు ప్రారంభించారు. అనంతరం జరిగిన కోలాటం పోటీలను వీక్షించారు. ఏటా ఇటువంటి పోటీలను నిర్వహించాలని కోరారు. ఈ పోటీల్లో 35 టీమ్‌లు పాల్గొనగా ప్రతిభ కనబరిచిన 5 టీమ్‌లకు బహుమతిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బోగి గౌరి, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, మాజీ సర్పంచ్ తెంటు నారాయణరావు, తెంటు మధుసూదన్, జేసీయస్ కన్వీనర్ మరిపి శంకర్రావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయలు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నిర్వాహకులు

ఒంటికాలిపై నిలబడి న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన నూతన భూహక్కు చట్టం-2022 ప్రజల పాలిట యమపాశం కాబోతోందని, న్యాయవాదులతో పాటు ప్రజలు కూడా ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందని ఎస్.కోట బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి అల్లు సత్యాజీ, డబ్ల్యు.ఎస్.శర్మ స్పష్టం చేశారు. నూతన భూహక్కు చట్టం అమలును నిరసిస్తూ ఈ నెల 21వ తేదీ వరకు కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు ఎస్.కోట కోర్టు బయట ఒంటి కాలుపై నిల్చుని బుధవారం తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల పాటు ప్రజలతో మమేకమై సేవలు చేసిన రిజిస్ట్రేషన్ వ్యవస్థ, రెవెన్యూ వ్యవస్థ, న్యాయ వ్యవస్థ ఇక ముందు మూతపడబోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన భూహక్కు చట్టం ప్రకారం భూ ప్రాధికార సంస్థ, టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి (టీఆర్వో) నియమితమైన తరువాత ప్రజల తాలూకు స్థిరాస్తులన్నీ టీఆర్వో పరిధిలోకి పోతాయని తెలిపారు. ఇలాంటి చట్టం పూర్తిగా అమల్లోకి వస్తే ప్రజలు తమ భూ హక్కులను కోల్పోయే ప్రమాదంతో పాటు న్యాయవాదుల వృత్తి కూడా ప్రస్నార్ధకం అవుతుందన్నారు. ప్రభుత్వం మొండి పట్టుదలకు పోతే న్యాయవాదులంతా ప్రజలను కలుపుకుని పోరాటాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బి.త్రిమూర్తులు, ఎం.చంద్రశేఖర్, టివిఆర్ మూర్తి, బి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, బివిఎస్ రామారావు, జి.చిట్టిబాబు, ఎం.అప్పారావు, సంతోష్, బొడ్డు వెంకటరావు, బొబ్బిలి రామకృష్ణ పాల్గొన్నారు.



ఒంటి కాలిపై నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ప్రజల వద్దకే వైద్యం

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రజల వద్దకే వైద్యం అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష అమలు చేస్తుందని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. పాతబొబ్బిలిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చోడిగంజి రమేష్, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్ల : నగర పంచాయతీ పరిధి మొయిద జంక్షన్-01 సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో డాక్టర్లు డి.రామునాయుడు, చంద్ర మౌళి, తిరుమలదేవి, టి.నారాయణరావు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మెన్ సముద్రపు రామారావు, మండల ప్రత్యేకాధికారి కె.శ్రీనివాస్, ఎంపిడిఒ జి.రామారావు, నగర పంచాయతీ కమీషనర్ పి.బాలాజీ ప్రసాద్, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, పిఇటిలు, పీడీలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదువుకొని పైకి ఎదగాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి ఆకాంక్షించారు. నెల్లిమర్లలోని శ్రీ ఆదిత్య పబ్లిక్ స్కూల్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌జిసి విద్యార్థులు బుధవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అక్కడ ప్రయోగ శాలలు, ఉద్యానవనం, పరిసరాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డాక్టర్ పుష్పలత, కిషోర్ మోహన్‌పాత్రో తదితరులు విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వి.అమృత, కరెస్పాండెంట్ డాక్టర్ వి.సూరిబాబు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయి కేసులో ఇద్దరికి జైలు

విజయనగరం: విజయనగరం రూరల్ పోలీసు స్టేషన్‌లో 2018లో నమోదైన గంజాయి కేసులో ఇద్దరు నిందితులకు 15సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.1లక్ష చొప్పున జరిమానా విధిస్తూ విజయనగరం 1వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జి. రజని తీర్పు వెల్లడించారని రూరల్ సిఐ టివి తిరుపతిరావు తెలిపారు. తమ స్టేషన్ పరిధిలోని రాకోడు - పినవేమలి గ్రామాల మధ్య 2018 ఫిబ్రవరి 19న అప్పటి రూరల్ ఎస్ఐ పి.రామకృష్ణ వాహన తనిఖీలు చేపట్టగా, గంట్యాడ మండలం నరవ గ్రామం ఎఎంజి కాలనీకి చెందిన చలుమూరి గంగునాయుడు (46), విజయనగరం పట్టణానికి చెందిన పెసల శాంసన్ (47) రెండు వేరువేరు మోటారు సైకిళ్ళపై నరవ గ్రామం నుండి వస్తూ, పోలీసులకు పట్టుబడగా, వారిద్దరి నుండి 65 కిలోల గంజాయిని అప్పటి తాశీల్దారు సమక్షంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు ఈ కేసులో నిందితులపై నేరారోపణలు రుజువుకావడంతో పై విధంగా తీర్పు వెల్లడించారని సిఐ తెలిపారు.

కెరటాం రైస్ మిల్లుపై కేసు నమోదు

బొండపల్లి : మండలంలోని కెరటాం గ్రామంలో ఉన్న మహేశ్వరి రైస్ మిల్‌ను బుదవారం తూనికలు కొలతలు అసిస్టెంట్ లీగల్ కంట్రోలర్ పివి రంగారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు వే-బ్రిడ్జ్ ను తనిఖీ చేయగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నప్పటికీ సంబంధిత సీల్‌లు తేడాగా ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. ఆయన వెంట సిఎస్‌డిటి రవి శేఖర్ ఉన్నారు.

యువకుడు ఆత్మహత్య

చీపురుపల్లి: చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని గులివిందాడ అగ్రహానికి చెందిన కోట్ల నవీన్ (28) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికుల వివరాలు ఇలా ఉన్నాయి. కోట్ల నవీన్ వెదుల్లవలస వైన్ షాపులో పని చేస్తున్నాడు. అయితే అతడికి ఉన్న ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని చెబుతున్నారు. బుధవారం ఉదయం విశాఖ నుండి పలాసా వెళ్లే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్టుషాపుపై దాడి

వేపాడ : మండలంలోని భరతవానిపాలెంలో అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్న బెల్ట్ షాప్ పై వల్లంపూడి ఎస్ఐ రాజేష్ బుధవారం దాడి చేసి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు మద్యం అమ్ముతున్న కాపుశెట్టి రమణను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌క్మి తెలిపారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలు

ప్రజాశక్తి- గుర్ల

ఆడుదాం ఆంధ్రా పోటీలు జిల్లాలో ఉత్సాహభరిత వాతావరణంలో జరుగుతున్నాయి. యువత ఈ పోటీల్లో పెద్ద ఎత్తున పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే గ్రామ స్థాయి పోటీలు ముగియగా, బుధవారం నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. సచివాలయ స్థాయిలో గెలుపొందిన జట్లు మండల స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. తొలిరోజు పలుచోట్ల క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటెన్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీలు, 27 మండలాల్లో ఈ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు మండలాలు, మున్సిపాల్టీలు కలిపి 1273 పోటీలను నిర్వహించారు. వీటిలో కబడ్డీ క్రీడలో 238 పోటీలు, ఖోఖో 199, క్రికెట్ 182, వాలీబాల్ 343, బ్యాడ్మింటెన్ క్రీడలో 311 పోటీలు జరిగాయి. మండల స్థాయి పోటీల్లోని విజేతలు, నియోజకవర్గ స్థాయి పోటీల్లో తలపడతారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు పోటీలను ప్రారంభించగా, ఎంపిడిఒలు, మండల స్థాయి అధికారులు ఈ పోటీలను పర్యవేక్షించారు.

గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల స్థాయి పోటీలను జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడుతో పాటు నాయకులు బెల్లాన బంగారునాయుడు, పొట్నూరు సన్యాసినాయుడు, కెవి సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మండలస్థాయి 'ఆడుదాం ఆంధ్ర' క్రీడాపోటీలను ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ రాయిపిల్లి రామారావు, వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు, ఎంపిడిఒ పి. త్రివిక్రమ్‌రావు, తహశీల్దార్ టి. రామకృష్ణ, ఎంఇఒలు, పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: క్రీడలలో యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు అన్నారు. స్థానిక గురుకుల పాఠశాల ఆవరణలో ఆడుదాం-ఆంధ్ర వాలీబాల్ పోటీలను వారు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సంకిలి శాంతికుమారి, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, టిపిఆర్ఒ జగన్మోహన్, వైసిపి నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వేపాడ: మండల కేంద్రంలో బుధవారం ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి ఆటల పోటీలను మండల ప్రత్యేకాధికారి లక్ష్మి నారాయణ ప్రారంభించారు. పోటీలలో 18 గ్రామ సచివాలయం నుంచి గెలిపొందిన క్రీడాకారులు పాల్గొని కబడ్డీ, వాలీబాల్, సెటిల్ పోటీల్లో తలబడ్డారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ఎంపిడిఒ ఉమా, మండల విద్యాశాఖ అధికారి పి. బాల భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: చింతలవలస 5వ బెటాలియన్‌లో ఆడుదాం ఆంధ్రా పోటీలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, యువజన నాయకులు బడ్డుకొండ ప్రదీప్ నాయుడు, జేసియస్ కన్వీనర్ సారిక గౌరీ, నాయకులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పట్టణంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఆడుదాం ఆంధ్ర లో భాగంగా మండల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలను ఎంపిడిఒ శేషుబాబు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల క్రీడా కోఆర్డినేటర్ డాక్టర్ పొట్నురు శ్రీరాములు క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తవలస: రాష్ట్రంలో యువతను మేల్కొల్పడానికే సిఎం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బలిఘట్టం వద్ద గల ప్రగతి డిఫెన్స్ అకాడమీ క్రీడా మైదానంలో మండల సాయి ఆటల పోటీలను ఎంపిడిఒ వై. పద్మజ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, మాజీ ఎంపిపి గొరపల్లి శివ, వైస్ ఎంపిపి కర్రీ శ్రీను, వైసిపి మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, ప్రగతి కళాశాల కరస్పాండెంట్ వనుము రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండల స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు టిషర్టులు, టోపీలు, క్రీడా కిట్లను బుదవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి యర్ర రమణ, నాయకులు మొయిద అక్కోజీ, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మండల సురేష్, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, రేగ సురేష్, కర్రి నానాజీ, ఎంపిడిఒ కే.కిషోర్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుల సంగం, జిల్లా కార్యదర్శి ఎల్వి రమణ, గ్రామ కార్యదర్శుల, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొత్తవలస: పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు